ప్రజాశక్తి
బుధవారం 19 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

విశాఖలో తపాలా అదాలత్

పార్వతీపురంరూరల్ : విశాఖపట్టణం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించే నిమిత్తం ఈనెల 28న విశాఖలోని పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం పోస్టుమాస్టర్ జనరల్ వారిచే 117వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించబడతాయన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 24లోగా "117వ తపాలా అదాలత్" అను శీర్షికతో కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం-530017" అను చిరునామాకు పంపవలసినదిగా కోరారు.

డొంక కదులుతోంది!

- నిధులు దారిమళ్లినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ఆ నిధులను కొంతమంది పంచాయతీ కార్యదర్శులు పక్కదారి పట్టించి తమ అవసరాలకు వినియోగించుకునే పరిస్థితి మండలంలో ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం పంచాయతీ ఖాతాలో జమ చేసిన విషయం తెలిసిందే. ఈ నిధులను పంచాయతీల్లో వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా కంప్యూటర్ ఆపరేటర్ల సాయంతో పనులు చేయకుండానే చేసినట్టు రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మండలంలో జరిగిన సుమారు రూ.20 లక్షల పైగా నిధులు పక్కదారి పట్టిన విషయం వార్తల్లో వచ్చినప్పటికీ అధికారుల్లో కనీసం చర్యలు లేకపోవడం విడ్డూరం. జిల్లాలోని ఒక్క కొమరాడ మండలంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంచాయతీ నిధులు ఇలా పక్కదారి పట్టాయని ఆరోపణలు ఉన్నాయి. దీంతో తీగ లాగితే డొంకంతా కదిలినట్టు జిల్లా వ్యాప్తంగా నిధులు పక్కదారి పట్టిన విషయం బయటకు వస్తుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా తూతూ మంత్రంగా జరిపి నిధులు పక్కదారి పట్టలేదని నివేదికలను అధికారులు సిద్ధం చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొమరాడ మండలంలో ఒక పంచాయతీ ఆపరేటర్ అకౌంటుకు సుమారు రూ.20 లక్షలకు పైగా నగదు జమైనప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విశేషం. దీనంతటికీ పంచాయతీ కార్యదర్శులు, ఇఓపిఆర్‌డిలు బాధ్యత చేపట్టాల్సి ఉన్నప్పటికీ కనీసం వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలకు దారితీస్తుంది.

2022 నుంచి కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించే నిధులు ఖర్చు వివరాలు పిఎంఎఫ్‌సి వెబ్సైట్లో అన్ని వివరాలు నమోదు చేసి బిల్లులు చెల్లింపులు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా ఇపిఎఫ్ఎంఎస్, ఈ గ్రామ స్వరాజ్ వెబ్సైట్లో అన్ని వివరాలు పూర్తిగా నమోదై ఉంటాయి. ఈ గ్రామ స్వరాజ్ యాప్‌లో పంచాయతీలకు ఖర్చు చేసిన నిధులు వివరాలన్నీ భారతదేశ ప్రతి పౌరుడు చూసేలా అందులో కనిపిస్తూ ఉంటాయి. కొమరాడ మండలంలో జరిగిన నిధుల దారి మళ్లింపు విషయంపై పలువురు ఈ వెబ్సైట్లో వివరాలు తీసినప్పటికీ అధికారులు ఎంతవరకు కనీసం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఎందుకంటే జిల్లావ్యాప్తంగా ఇదే వ్యవహారం ఉంది కనుక. ఒక మండలంలో చర్యలు చేపడితే జిల్లా వ్యాప్తంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆలోచన మేరకు ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ అయినా స్పందించి జిల్లాలో జరిగిన నిధుల పక్కదారిపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఏనుగుల జోన్ పెట్టొద్దు

పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ట్రెంచ్ కటింగ్ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు, ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని అమ్మా దేవి కొండ వద్ద ఏనుగులు జోన్ పెట్టొద్దని ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమ్మాదేవి కొండ చుట్టూ అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా చేపడుతున్న ట్రెంచ్ కటింగ్ (కందకాలు త్రవ్వకం)పనులను ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో అప్పయ్యపేట, జోగంపేట గుచ్చిమి, తాన సీతారాంపురం, పులుగుమ్మి, గదబవలస, రేపటివలస, తామరఖండి గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. జెసిబి, ప్రొక్లైనర్‌తో కందకాల తవ్వకం, ఇతర పనులు చేస్తున్న యంత్రాలను అడ్డుకొని బయటకు పంపించారు. ఈనెల 13న ఇలాగే అప్పయ్యపేట వద్ద పనులు చేస్తున్న యంత్రాలను అడ్డుకున్నారు. అటవీ అధికారులకు పనులు చేపట్టవద్దని ఏమైనా పనులు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రజలు హెచ్చరించారు. అయినా అటవీశాఖ అధికారులు ముందుగా పోలీసులను మోహరించి మళ్లీ పనులు ప్రారంభిస్తున్నారని తెలిసి ప్రజల మంగళవారం పెద్ద ఎత్తున అడ్డుకుని చేరుకొని అక్కడున్న యంత్రాలను బయటకు పంపించాలని, అంత వరకు అక్కడి నుంచి కదిలేది లేదని, లేకుంటే తీవ్ర పరిణామాలు దాపరిస్తాయని హెచ్చరిక చేశారు.

అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ కొండ పరిసర ప్రాంతాల్లో 50 ఏళ్లుగా పేదలు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసిందని, రైతు భరోసా కూడా వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. కొండ దిగువ ఆయకట్టు భూములకు కంధకాలు తవ్వడం ద్వారా సాగు నీటికి ఆటంకం కలుగుతుందన్నారు. వర్షాకాలంలో ఈ కొండగెడ్డల ద్వారా సీతానగరంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణం గల వెంకటరాయుడు చెరువు, గుచ్చిమిలో తాన్నచెరువు, అప్పయ్యపేటలో గొట్టాపు చెరువు, అప్పయ్యబంద, బుడ్డిపేటలో రామసాగరం చెరువు, కోమటి చెరువు, కారివాని బంద, లక్ష్మీపురంలో గల మావుళ్ళ చెరువులు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఏనుగులు ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికే తరలించాలని, లేదా జంతు సంరక్షణ కేంద్రానికి తరలించాలి కానీ జిల్లా నడిబొడ్డున, జనావాసాల మధ్య ఏనుగు జోన్ పెట్టడం ప్రభుత్వానికి తగదని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 38 మంది ఏనుగుల దాడిలో మరణించారని, రైతుల పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయని, అటువంటిది ఏనుగులను జనాల మధ్య వదలడం పాలకులకు మంచి పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని లేదంటే భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి ఏనుగుల జోన్ రద్దు చేసే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, సీతానగరం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న పిఒ శ్రీవాస్తవ

పనుల్లో పురోగతి ఉండాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న పనుల్లో పురోగతి ఉండాలని ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబరులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్లతో పిఒ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో చేపట్టిన బహుళ వినియోగ కేంద్రాలైన (మల్టీపర్పస్ సెంటర్లు) మినీ గోకులాలు, హాత్ బజార్, ఉపాధి హామీ పనులు, పిఎం జన్ మన్, సిసిడిపి, నాబార్డ్, ఎన్‌హెచ్ఎం, ఆర్టికల్ 275(1) గ్రాంట్ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రతి వారం పనుల్లో పురోగతి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ మణిరాజు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల నిర్వహణపై దృష్టి పెట్టాలి : ఎంపిడిఒ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులకు ఆదేశించారు. 'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన 'సృష్టీ లేదు... సంపదా లేదు' అన్న కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు సచివాలయాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వీలైనంత త్వరగా సంపద తయారీ కేంద్రాల్లో సంపద తయారు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎండల ప్రభావం వల్ల గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్లలో ఈ నెలాఖరుకు లక్ష్యాలు అధిగమించాలని ఆదేశించారు. ఎక్కడైనా మంచినీటి పథకాలు మరమ్మతులకు గురైతే తక్షణమే చేపట్టాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి టి.రమణమూర్తినాయుడు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

- ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేసుకున్న వారికి అదనపు ఆర్థిక లబ్ధి
- టెలీ కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేసిన కలెక్టర్

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గృహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర 2047 విజన్లో భాగంగా 2029నాటికి అందరికీ సొంత ఇళ్లుండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా పిఎంఎవై 1.0లో ఇళ్ల మంజూరై, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎస్‌సిలు, బిసిలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు సాయం అందించనుందని అన్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా అసంపూర్తి గృహ నిర్మాణాలకు రూ.73.09 కోట్ల మేర అదనపు సాయమందించే అవకాశం లభించిన సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సాయంతో ఇప్పటికే వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు చెందిన 10,717 గృహాలు పూర్తిచేసుకునేందుకు చక్కని అవకాశం లభించిందని పేర్కొన్నారు. జిల్లాలో బిసిలకు సంబంధించి బేస్మెంట్ లెవెల్ (బిఎల్)లో 1,485, లింటల్ లెవెల్ (ఎల్ఎల్)లో 1,820, రూఫ్ లెవెల్ (ఆర్ఎల్)లో 497, రూఫ్ కాస్ట్ (ఆర్.సి) లో 307 వెరసి 4,109 గహాలు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఎస్.సిలకు చెందిన గృహాల్లో బిఎల్ 410, ఎల్ఎల్ 404, ఆర్ఎల్ 232, ఆర్‌సి 123 వెరసి 1,169 ఉన్నాయని తెలిపారు. అలాగే ఎస్‌టిలకు చెందిన గృహల్లో బిఎల్ 911, ఎల్ఎల్ 432, ఆర్ఎల్ 1210, ఆర్.సి 520 వెరసి 3,073 ఉన్నట్లు చెప్పారు. పివిటిజిల్లో బిఎల్ 2,021, ఆర్ఎల్ 278, ఆర్.సి 67 వెరసి 2,366 ఉండగా అన్నీ కలిపి 10,717 గృహాలు పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. వీటిలో 7 వేల ఇళ్లను రానున్న జూన్ మాసం నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఇప్పటి వరకు చేపట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఈనెల 21లోగా చెల్లింపులు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి గృహాలు వేగవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవంగా పాటించాలని ఇదివరకే ఆదేశించడం జరిగిందని తెలిపారు. ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ కార్యక్రమాలు సామూహికంగా ప్రారంభించి, ఇచ్చిన లక్ష్యాలు సాధించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేసి గృహ నిర్మాణ దినోత్సవాన్ని పటిష్టంగా అమలుచేసి జిల్లాకు కేటాయించిన 7 వేల గృహ లక్ష్యాలను జూన్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో గహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవహారాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు రామస్వామి

బోయలను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి చర్చి సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆధోని ఎమ్మెల్యే పార్థసారథి బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితలో చేర్చాలని, 50 లక్షలు మంది ఉన్నారని చెప్పినట్లు తెలిపారు. ఇప్పటికే బోయ, వాల్మీకులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన వారని, అలాంటి వారిని గిరిజన తెగల్లో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాష్ట్రంలో 34 తెగల్లో ఉన్న 30 లక్షల మంది గిరిజనుల తరపున ఆరుగురు గిరిజన ఎమ్మెల్యేలు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కనీసం ఖండించకపోవడం బాధాకరమని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సభలో ఉన్నా ఖండించలేదన్నారు. గతంలో సిఎం చంద్రబాబునాయుడు గిరిజన రిజర్వేషన్లకు ఇబ్బంది కలగకుండా పూర్తి బాధ్యత వహిస్తానని చెప్పారని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించి గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని అన్నారు. ఇప్పుడు గిరిజనుల పీక మీద కత్తి పెట్టి గొంతు కోయాలని చూస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బోయలను ఎస్టీల్లో చేర్చాలంటూ బిజెపి ఎమ్మెల్యే మాట్లాడుతుంటే కనీసం ఒక్క కూటమి ఎమ్మెల్యే కూడా ఖండించకపోవడం గిరిజనులకు తీరని ద్రోహం చేసినట్లేనని చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, ఉపాధ్యక్షులు కూరంగి సీతారాం, జిల్లా కమిటీ సభ్యులు హిమారిక రామారావు, మండ కమిటీ సభ్యులు తదితరులు, మహిళలు పాల్గొన్నారు.

20న సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల చలో విజయవాడ

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం సచివాలయ ఆరోగ్యకార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.రమాదేవి, కార్యదర్శి సిహెచ్ స్వర్ణలత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యదర్శులను తమ మాతృ శాఖకు మెర్జ్ చేసేందుకు జరుగుతున్న అలసత్వం, నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. ప్రభుత్వం తమ జాబ్ వర్క్ చార్ట్ ప్రకారం తమ సొంత శాఖపరమైన పనులే కాకుండా ఇతరశాఖల పనులు చేసే క్రమంలో సచివాలయం ఆరోగ్య కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గత్యంతరం లేక అనివార్యంగా ఈనెల 20న చలో విజయవాడ తలపెట్టినట్టు తెలిపారు. విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో జరుగు మహా ధర్నాకు రాష్ట్రంలోని ఆరోగ్యకార్యదర్శులంతా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

హైటెక్ పోలీసింగ్‌తో నేరస్తులను పట్టుకోవాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి

ఐజి వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఎస్‌పి, పోలీసు అధికారులు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

నేరాల నిరోధానికి సంప్రదాయ పద్ధతితో పాటు హైటెక్ పోలీసింగ్ విధానాన్ని అలవర్చుకోవాలని ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను సమీక్షించారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సిసిటిఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలని తెలిపారు. ఇలా అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందని తెలిపారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు సంబంధిత అధికారులను వారి కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో నమోదు చేసారో లేదో అని అరా తీశారు. సీసీటీఎన్ఎస్‌లో ముఖ్యంగా గ్రేవ్ కేసు నాన్ గ్రావ్ కేసు లో పార్ట్ 1, పార్ట్ 2 సీడీలు అప్డేట్‌గా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మర్డర్ కేసుల్లో, 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన పురోగతి పొందేలా చూసుకుంటూ అభియోగ పత్రాలను వీలైనంత తొందరగా కోర్టులో దాఖలు చేయాలి అని అన్నారు.

ఈ నేర సమీక్షా సమావేశంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న ఐజి మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా పరిధిలో గల కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే వారిపై చర్య తీసుకునేలా వీలైనంత తొందరగా ఎఫ్ ఐ ఆర్ వేసేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా ఒడిశా సరిహద్దుకు దగ్గరగా ఉండడం వల్ల రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో గంజాయి వస్తున్నందున రైల్వే, ఆర్పిఎఫ్ ఫోర్స్‌తోనూ, లోకల్ సిసిఎస్, ఐడి పార్టీ సిబ్బందిని కోఆర్డినేట్ చేసుకుంటూ ఇన్ఫర్మేషన్ పొంది గంజాయిని పట్టుకుని అరికట్టేలా చూడాలని ఆదేశించారు. అలాగే సిసిఎస్, ఐడి పార్టీలు సమన్వయంతో బోర్డర్ పిఎస్‌ల్లో ఉన్న నిర్మానుష్య ప్రదేశాల్లో చైన్ స్నాచింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా చూడాలన్నారు. జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి గ్యాంగులుగా వచ్చి రాష్ట్రంలో దొంగతనం, స్నాచింగ్, మర్డర్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఇవి జరగకుండా ఉండాలంటే మనం లోకల్ సిసిఎస్ ఐడి పార్టీలతో మమేకమై సదరు నేరాలు జరగకుండా అరికట్టాలని తెలిపారు. ఐ గాట్ కర్మయోగి సెంట్రల్ గవర్నమెంట్ పెట్టిన పథకంలో సర్టిఫికెట్ అప్డేట్ చేసుకోవాలని, న్యూ క్రిమినల్ లాస్ ఇంప్లిమెంటేషన్ మనకు అవసరమని, దానిపై అవగాహన నిమిత్తం శిక్షణ పొందేలా చేయాలని దిశా నిర్దేశాలు చేశారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎఎస్‌పి అంకిత సురాన,ఐపిఎస్, పాలకొండ డిఎస్పీ ఎం.రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బి సిఐ రంగనాథం, డిసిఆర్‌బి సిఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎఆర్ ఆర్ఐ రాంబాబు, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఐఆర్‌డిఎ శ్రీధర్ పాల్గొన్నారు.

ఐరన్ హెపటైటిస్‌తో అప్రమత్తం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అవగాహన, అప్రమత్తంతో వైరల్ హెపటైటిస్ (వైరల్ సంబంధిత కాలేయ వ్యాధి) సోకకుండా జాగ్రత్త పడవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. ఈ మేరకు కాలేయ వ్యాధి నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వైరస్ ద్వారా సోకే కాలేయ వ్యాధికి కారణం ఐదు రకాల వైరస్ లని, అవి హెపటైటిస్ ఎ,బి,సి,డి,ఇ అని ఇందులో హెపటైటిస్-బి ముఖ్యమని అన్నారు. రోగ లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. వైరల్ హెపటైటిస్ సోకిన వారిలో శరీరం త్వరగా అలసిపోవడం, కడుపు నొప్పిగా ఉండడం, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, చర్మం రంగు మారడం, కళ్ల పసుపు రంగులోకి మారడం (కామెర్లు), మూత్రం రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అవగాహన, జాగ్రత్తలతో వ్యాధిని సులభంగా నివారించవచ్చని తెలిపారు. నిర్ధారణ పరీక్షలతో వ్యాధిని గుర్తించవచ్చని తద్వారా తగిన చికిత్స, నివారణ చర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని అన్నారు. గర్భిణులందరికీ హెపటైటిస్-బి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి పుట్టిన పిల్లలకు ఆసుపత్రుల్లో వెంటనే ఇమ్యునో గ్లోబ్యులిన్ వేయించాలన్నారు. అలాగే పుట్టిన వెంటనే పిల్లలందరికీ హెపటైటిస్-బి టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. వైరస్ సంబంధిత కాలేయవ్యాధి పై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలా, డెమో సన్యాసిరావు, డిఎస్ఒ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో ప్రసవాల మెరుగుకు కృషి చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపడేందుకు శిక్షణను సద్వినియోగం చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు స్టాఫ్ నర్సులకు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీ ఓరియంటేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులకు ధ్రువపత్రాలు ఆయన అందజేశారు. బ్యాచ్‌ల వారీగా పిహెచ్‌సి స్టాఫ్ నర్సులకు నిర్దేశించిన ఎస్బిఎ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) శిక్షణా కార్యక్రమంలో మొదటి బ్యాచ్ గత నెల 24న ప్రారంభించి ఈనెల18 వరకు 21రోజులు జిల్లా ఆసుపత్రిలో, ఆరోగ్య కార్యాలయంలో శిక్షణ ఇచ్చామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో గైనకాలజిస్టులు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. గర్భదారణ, ప్రసవం, ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలను నివారించడంలో నైపుణ్యతను పెంపొందించడం, ప్రసవానంతర కాలంలో గర్భిణీ, బాలింత, శిశువులకు ప్రాథమిక, అత్యవసర సంరక్షణ అందించడం,హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి ప్రమాదకర పరిస్థితులకు దారితీయకుండా సురక్షిత సాధారణ ప్రసవం మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మాతా, శిశు మరణాలు నివారించడం, పిహెచ్సీ ప్రసవాలు మెరుగుపర్చడం శిక్షణ ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా ఎం.వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

అంగన్వాడీ హెల్పర్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం జన్ మన్ అంగన్వాడీ హెల్పర్స్ ఇంటర్వ్యూలను ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం తన ఛాంబరులో నిర్వహించారు. మొత్తం 8 పోస్టులకు గాను 13 మంది అభ్యర్థులు హాజరుకాగా, ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూ ప్యానల్‌లో ప్రాజెక్ట్ అధికారితో పాటు ఐసిడిఎస్ పథక సంచాలకులు డాక్టర్ టి.కనకదుర్గ, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, సిడిపిఒ తదితరులు ఉన్నారు.

సిసి రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

ఇలా ఉంటే ఏం ప్రయోజనం?
రోడ్డు మధ్యన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మర్కొండపుట్టి పంచాయతీ పరిధిలో గల పెదగైసాలలో లక్షలాది రూపాయలు వెచ్చించి సిసి రహదారి నిర్మించారు. అయితే ఈ రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభం రహదారి నిర్మించక ముందు నుండి ఉన్నప్పటికీ దాన్ని తొలగించకుండానే రోడ్డు నిర్మించినా ప్రయోజనం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో రహదారిపైకి ఏ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ప్రారంభంలోనే విద్యుత్ స్తంభం అడ్డంగా ఉందని స్థానికులు అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు

బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీమంత్రి పుష్పశ్రీవాణి

కార్యకర్తలకు పుష్ప శ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం:

అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి కార్యకర్తలను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి మంగళవారం పరామర్శించారు. కురుపాం పంచాయతీలోని శివన్నపేట, కాటందొరవలసలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రంశెట్టి రేవతి, బిడ్డిక వెంకటరమణను పరామర్శించారు. మీకు ఎల్లప్పుడూ వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, స్థానిక సర్పంచ్ సుజాత, జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి మైనార్టీ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి షేక్ నూరుల్లా, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, క.గౌరీశంకర్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సిసి రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.10లక్షల అంచనా వ్యయంతో మండల పరిషత్ నిధుల నుంచి కాలువతో పాటు సిసి రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుండి మండల మహిళా సమైక్య కార్యాలయం వరకు సిసి రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పంచాయతీరాజ్ సహాయక ఇంజనీర్ పి.భాస్కరరావు తదితరలు ఉన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

అర్హులైన వారి నుంచి స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతోందని ఎంపిడిఒ జె.ఉమమహేశ్వరి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. 21 నుంచి 60 ఏళ్లలోపు గల బిసి, ఇబిసికి చెందిన వారు ఈనెల 22లోగా సచివాలయం, ఇంటర్నెట్ సెంటర్లో https://apobmms.apcfss.in అనే సైట్ దరఖాస్తులు చేసుకోవాలని దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతోమండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలని అన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేశ్వరి

ఎస్‌కె పాడులో నవోదయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని సవర కోటపాడు, జాతపు కోటపాడు కాలనీల్లో ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఎస్ఐ సిహెచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటసారా అమ్మకాలు, వంటకాలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అడాప్షన్ ఆఫీసర్ సుదర్శన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

డిఎల్ఎస్ఎ చైర్మన్

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరంలోని ఎడిఆర్/ మీడియేషన్ సెంటర్‌లో పనిచేసేందుకు టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నట్లు విజయనగరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) చైర్మన్ మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఈ పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉద్యోగికి విధుల్లో చేరిన నాటి నుంచి నెలకు రూ.18,500 చొప్పున ఏడాది పాటు పారితోషికం చెల్లించబడుతుందన్నారు. ఓపెన్ కాంపిటేషన్ కింద మహిళా అభ్యర్థులు అర్హులని, దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన లేదని అన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన ఏదైనా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలని, ఇంగ్లీష్ టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ చేసి ఉండాలని అన్నారు. అటువంటి అభ్యర్థులు లేనియెడల లోయర్ గ్రేడ్ అభ్యర్థిని తీసుకోనున్నట్టు తెలిపారు. 2023 సెప్టెంబర్ 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నిండి, 42 ఏళ్లలోపు ఉండాలని, వికలాంగులకు 10 ఏళ్లు, ఎస్సి, ఎస్టీ, బిసి, ఇడబ్ల్యూఎస్ వారికి 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్‌కు ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996, ఏపీ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ రూల్స్ 1992లోని నియమాల మేరకు వయసు సడలింపు ఉంటుందని అన్నారు. డిగ్రీ పాసైన సర్టిఫికేట్, వయసు, కుల నిర్ధారణ సర్టిఫికేట్లు తప్పనిసరి అని, ఇతర విద్యార్హతలు, టెక్నికల్ సర్టిఫికేట్లు ఉంటే సమర్పించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణిత ప్రొఫార్మాలో తమ వివరాలను పూరించి, సీల్డ్ కవరులో దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5.00గం.ల్లోగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, కోర్ట్ కాంప్లెక్స్, విజయనగరం కార్యాలయానికి చేరేలా సమర్పించాలని అన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా పోస్టు భర్తీ ఉంటుందన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చూపాలని అన్నారు.పోస్టుల ప్రక్రియ తుది నిర్ణయం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, విజయనగరం వారిదేనని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

అటెండర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

అలాగే అటెండర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు కూడా దరఖాస్తులను కోరుతున్నారు. ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన అటెండర్, ఆఫీస్ సబార్డినేట్ రెండు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉద్యోగులకు విధుల్లో చేరిన నాటి నుంచి నెలకు రూ.15వేలు పారితోషికం చెల్లించబడుతుందని అన్నారు. ఈ పోస్టుల్లో ఎస్‌సి మహిళ, ఓపెన్ కాంపిటేషన్ కింద ఒక పోస్టు ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. దరఖాస్తుదారులు 7వ తరగతి పాసై, తెలుగు చదవడం, రాయడం వచ్చి ఉండాలని, సైకిల్ తొక్కగల సామర్థ్యం కలిగి ఉండాలి. 2023 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అభ్యర్థుల వయసు 18 నిండి, 42 ఏళ్లలోపు ఉండాలని, వికలాంగులకు 10 ఏళ్లు, ఎస్సి,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5 ఏళ్లు సడలింపు ఉంటుందని అన్నారు. 7వ తరగతి పాసైన సర్టిఫికేట్, వయసు, కుల నిర్ధారణ సర్టిఫికేట్లు తప్పనిసరి అని, ఇతర విద్యార్హతలు, టెక్నికల్ సర్టిఫికేట్లు ఉంటే సమర్పించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మాలో తమ వివరాలను పూరించి, సీల్డ్ కవరులో దరఖాస్తులను ఈ నెల 20లోగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, కోర్ట్ కాంప్లెక్స్, విజయనగరం కార్యాలయానికి చేరేలా సమర్పించాలని అన్నారు.


డిటికి వినతిని అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, కేజీకి రూ.200, 80 కేజీలకు రూ.16వేలు మద్దతు ధర ఇవ్వాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు మంగళవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని నారాయణపురం, గౌరీపురం, పెద్దింపేట, అరసాడ, పెదమాయవలస, మిర్తివలస, పెదపెంకి, బైరిపురం గ్రామాల్లో సుమారుగా వెయ్యి ఎకరాల్లో జీడి సాగవుతుందన్నారు. బయట మార్కెట్లో జీడికి ఎక్కువ ధర ఉంటే ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడంలేదన్నారు. దీంతో జీడి రైతులు నష్టపోతున్నారన్నారు. కావున జీడి కేజీకి రూ.200, 80 కేజీలకు రూ.16వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కోరారు కార్యక్రమంలో నాయకులు గేదెల సత్యనారాయణ, బి.భానుమూర్తి, రెడ్డి సూరి, యమ్మల మన్మధరావు, దన్నాన త్రినాధ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి -సాలూరురూరల్

గిరిజనులపై దాడి చేసి, వారిని కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి గిరిజనులకు అగ్రవర్ణాల నుంచి రక్షణ కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొండ గొర్రె ఉదయ్ కుమార్ వంతల సుందర్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బాధిత కుటుంబాలతో కలిసి మాట్లాడుతూ మండలంలోని తోణాం పంచాయతీ మద్దినవలసన కూనేటి లక్ష్మణరావు, వారి కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన వీరమల్లు నాగేశ్వరరావు, మోహన్‌రావు, ఒరుగంటి మస్తాన్‌రావు, కొండలరావు, సిహెచ్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి చిన్నపిల్లలను, మహిళలన్న తేడా లేకుండా దాడి చేసి గాయపర్చడమే కాకుండా కులం పేరుతో దూషించడం బెదిరించడం సరికాదని తెలిపారు. దాడి చేసి, గాయపర్చి, కులం పేరుతో దూషించిన వారందరిపై సమగ్ర దర్యాప్తు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. లేనిచో ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి నాయకులు జై సింహ, గెమ్మెల బాబయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి తదితరులు పాల్గొన్నారు.

కంబరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు సచివాలయం పరిధిలో గల కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా నీలావడి అగ్ని గంగమ్మ జాతర

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రా -ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ నీలావడిలో ప్రఖ్యాతిగాంచిన అగ్ని గంగమ్మ జాతర ఆఖరి రోజు మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. అగ్ని గంగమ్మను దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. ఉత్తరాంధ్రకు చెందిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. లక్షలాది మంది తరలివచ్చే ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని స్థానిక తహశీల్దార్ మోనికా మిశ్రా తెలిపారు. పోలీసులతో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, వసతి వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బడే సత్యనారాయణ తెలిపారు. జాతరను దర్శించుకునేందుకు పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి రోజుకు 6 బస్సులు నడపడం ద్వారా అధిక ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు.

సహజ ఎరువులతో భూమి బాగు

ప్రజాశక్తి - పాచిపెంట

వేసవిలో సహజ ప్రకృతి ఎరువులను తయారు చేసి, నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు వాడుకుంటే రైతులకు డబ్బు ఆదా అవ్వడమే కాకుండా నేల స్వభావం బాగుపడి భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో ప్రకృతి సేద్య ఎల్-1 తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో రైతు కె.నారాయణరావు చేపట్టిన ఘన జీవామృతం తయారీలో పాల్గొన్నారు. ఈ ఎరువులను వాడితే రసాయన ఎరువులపై వెచ్చించే ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఒక్కసారి తయారు చేసిన ఘనజీవామృతం ఆరు నెలల పాటు నిల్వ ఉంటుందన్నారు. ప్రస్తుత వేసవిలో రైతులకు పొలం పనులు ఉండవు కాబట్టి ప్రకృతి ఎరువుల తయారీకి సమయాన్ని వెచ్చించినట్లయితే డబ్బు ఆదాతో పాటు భూమిని బాగు చేసుకోవచ్చని సూచించారు. ఘనజీవామృతం వేసిన భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అందడమే కాకుండా భూసారంగా పిలవబడే హ్యూమస్ శాతం కూడా క్రమక్రమంగా పెరుగుతుందని వివరించారు. కావున రైతులు ప్రకృతి ఎరువుల దిశగా దృష్టి సారించాలని కోరారు. అనంతరం సహజ నాడెప్ కంపోస్ట్ పెట్టును పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ ఈదిబిల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తుందని, కావున రైతులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ నిర్మల జ్యోతి అన్నారు. మండలంలోని జెకె పాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటో వాటర్స్, పవర్ వీడర్, స్ప్రేయర్స్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రకతి వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు.

పాచిపెంటలోని నాడెప్ కంపోస్ట్‌ను పరిశీలించిన ఎఒ తిరుపతిరావు

ఘనజీవామృతం తయారీ చేసి వివరించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ ప్రసాదరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కిమిడి భూషణ్, గణేష్, చామంతి ఉన్నారు.

సీతానగరం : మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో తన్నా సీతారాంపురంలో ఘన జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఘన జీవామృతంలో దేశీయ ఆవు పేడ 20 కేజీలకు లీటర్ ఆవు మూత్రం, కేజీ పప్పుల పిండి, అరకేజీ బెల్లం, కొంచెం పుట్టమన్ను కలుపుకొని 10 రోజులు ఎండబెట్టి వాటిని దుక్కిలో కాని లేదా పొలంలో చల్లుకోవాలన్నారు. దీని ద్వారా డిఎపి వినియోగం తగ్గుతుందని తెలిపారు. ఇది ఒక డిఎపిలా మొక్కలకు పని చేస్తుందన్నారు. అలాగే వ్యవసాయ పనిముట్లు కూడా అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు వ్యవసాయ అసిస్టెంట్లను కలిసి అప్లికేషన్ ఇవ్వవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

ఏడు పంచాయతీలకు భవనాలు మంజూరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.రాజపురం, కె.ఇచ్చాపురం, పెదగదబవలస, కుమ్మరిగుంట, కంబరవలస, యు వెంకంపేట, గాదిలంక గ్రామాల్లో పంచాయతీ భవనాలు మంజూరైనట్లు మండల పంచాయతీరాజ్ జెఇ డి.కల్యాణిదుర్గ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.32 లక్షలు ఉపాధి హామీ ద్వారా రూ.12 లక్షలు, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎం.రాజపురం, కె.ఇచ్చాపురం, పెదగదబవలస గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మిగిలిన చోట్ల కూడా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

25 నుంచి కైలాసనాధ యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉమా సహిత కైలాసనాధ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 25 నుంచి 29 వరకు ఐదు రోజులు యాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పాలక ప్రేమానంద్, ఆలయ, యాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్యే స్పోర్ట్స్ మీట్-2025 లో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి కురుపాం , పార్వతీపురం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. జగదీశ్వరి వాలీబాల్ క్రీడ పోటీలో పాల్గొన్నారు.

ఎఫ్ఎసి తహశీల్దార్‌గా శేఖరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల తహశీల్దారు (ఎఫ్ఎసి)గా నిమ్మక శేఖరం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఉన్న తహశీల్దార్ శివన్నారాయణకు భామిని బదిలీ అయ్యింది. అక్కడ ఉన్న తహశీల్దార్ ఎన్.అప్పారావును సోమవారం గుమ్మలక్ష్మీపురం మండల తహశీల్దార్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం గుమ్మలక్ష్మీపురంలో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ నిమ్మల శేఖరంకు ఇన్చార్జి తహశీల్దారుగా బాధ్యతలు అందించారు. మళ్లీ అప్పారావు పాలకొండ కెఆర్‌సిసి తహశీల్దార్‌గా అధికారులు బదిలీ చేశారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న స్టేట్‌కౌన్సిల్ సభ్యులు లావణ్యకుమార్

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి పంచాయతీలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను స్టేట్ కౌన్సిల్ సభ్యులు లావణ్య కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణం జరుగుతున్న ఫారం పాండ్స్, అంగన్వాడీ ప్రహరీ గోడల పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలోగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ కృష్ణారావు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగలత

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో భవన నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలని జిల్లా టౌన్, కంట్రీ ప్లానింగ్ అధికారి జి.నాగలత అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనుమతి తీసుకున్న తర్వాతే లబ్ధిదారుడు భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజ్, ఇఒపిఆర్‌డి ధర్మారావు ఉన్నారు.

ట్రూ అప్ ఛార్జీల రద్దుకు నిరసనలు

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ బిల్లులు తగ్గించి ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పాకివీధిలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు నేడు విద్యుత్ ఛార్జీలు పెంచి ట్రూ ఆఫ్ ఛార్జీలు భారం వేయడం అన్యాయమన్నారు.

లక్కవరపుకోట: విద్యుత్ ఛార్జీలను పెంచి, ట్రూ అఫ్ ఛార్జీలను రద్దు చేయాలని జిల్లా వ్యవసాయ కమిటీ అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు టి. వెంకటరమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, వినియోగదారులు చంద్రిక, రామారావు, శ్రావణి, కనక, రాజ్యలక్ష్మి, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు జక్కాన రమణ, జక్కాన దేముడు, జక్కన సత్యనారాయణ, మహేష్, దావాల కన్నంనాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, గమ్మెల సన్యాసిరావు, తాడి చిన్నారావు, పాంగి నాగేశ్వరరావు, వంతల చిన్న తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ సర్పంచ్ టొంపల సీతారాం, మందపాటి వాసు రాజు, మద్దతు తెలిపారు.

గజపతినగరం, దత్తిరాజేరు : పెంచిన విద్యుత్తు ఛార్జీలను, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన దత్తి రాజేరు మండల కేంద్రంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో గణేష్, సురేష్, బి.వెంకటరమణ, రాము, సరోజినీ, గౌరీ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు

గజపతినగరం మండలం బంగారంపేటలో సిపిఎం నాయకులు తెరలాపు కృష్ణ ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ, అచ్చియమ్మ, కె.రాము, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నోటిస్ బోర్డు ప్రకటన

రేఖా సంఖ్యా : 05/2025-26 తే.17.03.2025ది

పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, వీరఘట్టం గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు-Iలో గల గుత్తలు 2025-26. సంవత్సరమునకు గుత్తలు హక్కులు పొందుటకు గాను వీరఘట్టం గ్రామ పంచాయితీలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని 25-03-2025 మంగళవారం మధ్యాహ్నం గం.03-00లు నుండి వీరఘట్టాం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయబడును. మరియు ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు - IIలో సీలు వేసిన టెండర్లు తే.25-03-2025 మంగళవారం ఉదయం గం॥ 11-00 లు నుండి గం॥ 1-00 వరకు స్వీకరించబడును. ఆరోజు మధ్యాహ్నం 03-00లుకు టెండరు దారుల సమక్షములో తెరవబడును.

మరియు వేలం పాటలో పాల్గొన దలచిన వారు శ్రీ విస్తరణాధికారి పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, వీరఘట్టాం - వారిచే సాల్వెన్సీ ధృవపత్రం రూ.50,000/-లు (అక్షరాల యాభై వేల రూపాయులు మాత్రమే) మరియు రూ.1,00,000/- (అక్షరాల లక్ష రూపాయిల మాత్రమే) శ్రీ డివిజనలు పంచాయతీ అధికారి, పాలకొండ వారిచే సాల్వెన్సీ ధృవపత్రం విలువ గలది. వేలం పాటలకు ముందుగా ఈ దిగువ సంతకం దారునకు సమర్పించి షెడ్యులు -I నందు చూపిన ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను. మరియు షెడ్యులు-II లో టెండర్లుకు ధరావత్తు చెల్లించి టెండర్లు వేయవలెను. మరియు ఇతర వివరములు పద్ధతుల ఈ గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలందు అడిగి తెలుసుకోవచ్చును.

షెడ్యులు-I

వ.నెం	గుత్తలు వివరములు	సంవత్సరము	దరావత్తు
1	రోజువారి మార్కెట్	2025-26	20000-00
2	బస్సు & కార్టు స్టాండ్ (లారీలు మరియు ఆర్‌టిసి బస్సులు మినహా)	2025-26	5000-00
3	పాత బస్టాండ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ లో 6 షాపులు మరియు పంచయితీ ఎదురుగా ఉన్న 8 షాపులకు (ఒక షాప్ ఒక్కంటికి)	2025-26	10000-00
4	పాత బస్టాండ్ లోని 9వ ప్లాట్లు ఆక్రమించుకొనుటకు (ప్లాట్ ఒక్కంటికి)	2025-26	7500-00
5	పాత బస్టాండ్ లోని 10వ ప్లాట్లు ఆక్రమించుకొనుటకు (ప్లాట్ ఒక్కంటికి)	2025-26	17500-00

షెడ్యులు-II

వ.నెం	టెండర్లు వివరములు	సంవత్సరము	దరావత్తు
1	2025-26 సంవత్సరమునకు మంచినీటి రక్షిత సరఫరా పథకం యొక్క పంపుహౌస్ వద్ద మోటార్ వేయుటకు ఆపుటకు, వాటర్ వర్క్సుకు అవసరమగు పనులు చేయుటకుగాను అనుభవం గల ఇద్దరు వ్యక్తిలు కాంట్రాక్టు పద్ధతిపై చేయుటకు గాను.	2025-26	1000-00
2	2025-26 సంవత్సరమునకు పారిశుధ్యము నిమిత్తం అవసరమగు బ్లీచింగు, పొడి సున్నం, పినాయలు సప్లై చేయుటకు	2025-26	1000-00
3	2025-26 సంవత్సరమునకు పారిశుద్ధ్య వినివారులకు బాబి యునిఫారం రెండు జతలు మరియు చీరలు సప్లై చేయుటకు	2025-26	1000-00
4	2025-26 సంవత్సరమునకు పారిశుద్ధ్య పనివారులకు కొబ్బరి నూనె మరియు సబ్బులు సప్లై చేయుటకు	2025-26	1000-00

బి.కోటేశ్వరరావు
కార్యనిర్వహణాధికారి,
(పంచాయితీ కార్యదర్శి),
గ్రామ పంచాయితీ, వీరఘట్టాం.